క్లుప్తంగా

నేడు వేలం పాట

శివ్వంపేట(నర్సాపూర్): చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం కొబ్బరికాయల విక్రయాల కోసం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించు వేలం పాటలో పాల్గొనేవారు రూ.లక్ష డిపాజిట్ చేసి పాల్గొనాలన్నారు. 20న నిర్వహించిన వేలం పాటలో సరైన ధర రానందున రెండోసారి నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

శేరిపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడుగా శ్రీరామ్

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీరామ్ భరత్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చెర్కం వెంకటి, కార్యదర్శి చిన్నబాబు, కోశాధికారిగా భానుప్రసాద్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మరో పదిమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్, లక్ష్మి నర్సింహులు, చిన్న కష్టాగౌడ్, బాలాజీ, బాలకష్ణ గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మిర్జాపల్లిలో...

చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులుగా భాస్కర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నీలం సుధాకర్, కోశాధికారిగా కుంట సందీప్, కార్యదర్శిగా సంగని జైపాల్ ఎన్నుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. తూప్రాన్ మండలం కోనాయిపల్లి గ్రామానికి చెందిన దర్పల్లి కుమార్(54) 5న చేగుంట మండలం అనంతసాగరర్ గ్రామంలో అత్తగారింటికి వచ్చాడు. అదే రోజు రాత్రి తిరిగి బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా కుమార్ ఉల్లితిమ్మాయిపల్లి శివారులో ధాన్యం కుప్పను ఢీకొట్టి కిందపడిపోయాడు. తీవ్రగాయాలైన అతడిని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలో బీరప్ప కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఉత్తులూర్‌లో కామరాతిదేవి బీరప్పస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రోషన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, కన్నయ్యగారి రమేష్, బూత్కూరి సుభాష్, శంకర్‌గౌడ్, దుర్గేష్, రాజేష్, మల్లేశం, సాయిలు, దేవయ్య, గంగారాం, కుర్మసంఘం నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మనోహరాబాద్(తూప్రాన్): కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కాళ్లకల్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు వీరబోయిన సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మండల కార్మికులతో కలిసి సీఎం క్యాంప్ కార్యాలయ ముట్టడికి తరలివెళ్ళినట్లు తెలిపారు. 1996 కార్మిక చట్టం ప్రకారం తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నామన్నారు. న్యాయమైన డిమాండ్లకై హైదరాబాద్‌కు తరలివెళ్లిన కార్మికులను ముందస్తు అరెస్టులు చేయడం సరైంది కాదని అన్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

వెల్దుర్తి(తూప్రాన్): మండల పరిధి అరెగూడంకు చెందిన కొందరిపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ట్రైనింగ్ ఎస్‌ఐ జ్యోతి తెలిపారు. గ్రామానికి చెందిన మేడికొండ సాయిలు, కాళ్ల బీరయ్య, గొల్ల రాజయ్య, మల్లవ్వ, బాలయ్య పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని ఇంటి పక్కన నివాసం ఉంటున్న హనుమద్రి లక్ష్మీ, అతడి కుమారుడు నరేశ్ గౌడ్ ఇంటి వద్దకు వెళ్లి బూతులు తిడుతూ కట్టెలతో దాడి చేశారు. ఈ ఘటనలో లక్ష్మీ, నరేశ్‌గౌడ్‌కు గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

27 నుంచి యోగా శిక్షణ

రామాయంపేట(మెదక్): తెలంగాణ ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆదేశాల మేరకు 27 ఉంచి వచ్చే నెల 26 వరకు ప్రభుత్వ విభాగాల్లో యోగా సమావేశాలు నిర్వహించనున్నట్లు యోగా శిక్షకుడు మద్దెల భరత్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా 27 మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో యోగా శిక్షణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఆశ వర్కర్లతోపాటు కమ్యూనిటీ వర్కర్లకు యోగా విషయమై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు.

జీలుగ సాగుతో లాభాలెన్నో..

- పంటలకు సేంద్రియ ఎరువు తయారు
- సబ్సిడీపై అందుబాటులో విత్తనాలు
- రైతులు ముందుకురావాలని అధికారుల సూచన



జీలుగ సాగు గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చేగుంట(తూప్రాన్): ముందస్తు వర్షాలు కురుస్తున్న తరుణంలో జీలుగ విత్తనాలు వేసుకుంటే పొలంలో సేంద్రియ ఎరువును తయారు చేసుకునే అవకాశం ఉంది. మండలంలోని పలు గ్రామాల్లో కొంతమంది రైతులు మాత్రమే జీలుగ విత్తనాలు వేసుకొని పంటలకు ఎరువు తయారు చేసుకుంటున్నారు. జీలుగ పంట 20 నుంచి 30 రోజుల్లో పూత దశకు చేరుకోగానే మొక్కలను పొలంలోనే కలియదున్ని సూపర్ పాస్ఫేట్‌ను దుక్కిలో వేసుకుంటే జీలుగ మొత్తం కుళ్లిపోయి పచ్చిరొట్ట ఎరువుగా మారుతుంది. జీలుగ ఒక ఎకరాకు మూడు టన్నుల పచ్చిరొట్ట ఎరువుగా తయారవుతుంది. పచ్చిరొట్ట ఎరువుతో నత్రజని, జింక్, మాంగనీస్, కాల్షియం వంటి సూక్ష్మధాతువులు తయారవుతాయి. పంటల్లో నీటి నిల్వ సామర్థ్యం పెంచడంతో పాటు నేలలో కరగలేని మూలకాలను పంటలకు అనువుగా తయారు చేస్తాయి. జీలుగ పంటతో ప్రధాన పంటలకు అవసరమైన మంచి సేంద్రియ ఎరువు తయారవుతుంది. దీంతో పంటల దిగుబడి సైతం పెరుగుతుంది. గత సంవత్సరం వానాకాలం సీజన్‌లో 250 క్వింటాళ్ల జీలుగ సబ్సిడీపై అందించగా, మండలంలో 1,550 ఎకరాల్లో రైతులు జీలుగ పంట వేసుకొని పచ్చిరొట్ట ఎరువును తయారు చేసుకున్నారు. సహజ సిద్ధంగా తక్కువ ఖర్చుతో ఏర్పడే పచ్చిరొట్ట ఎరువు ఏర్పడే జీలుగను ఎక్కువ మంది రైతులకు వేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. విత్తనాలను సబ్సిడీతో వ్యవసాయ శాఖ అందజేస్తుంది.

> **త్వరలోనే అవగాహన కార్యక్రమాలు**
>
> 
>
> ఈవానాకాలం సీజన్‌లో 350 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందించేందుకు తీసుకొస్తున్నాం. అవగాహన కల్పించినప్పటికీ కొన్ని గ్రామాల్లో మాత్రమే రైతులు జీలుగ పంటలు వేసుకుంటున్నారు. అన్ని గ్రామాల్లో పంటలు వేసుకునేలా త్వరలోనే అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం.
>
> – హరిప్రసాద్, వ్యవసాయ అధికారి, చేగుంట

క్రీడలతో స్నేహ భావం పెంపు



ఎస్‌ఐ రంజిత్‌రెడ్డిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): క్రీడలతో స్నేహ భావం పెరుగుతుందని ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన 2005–06 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం ముంద్రాయిగేట్ వద్ద ఒక్కరోజు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లు ఆడారు. ఈ పోటీలను ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శరీరధారుఢ్యం, మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు. క్రీడలలో గెలుపోటములు సహజమని, ప్రతిరోజు ఆటలు ఆడాలని సూచించారు. పిల్లలను సైతం సెల్‌ఫోన్‌లను దూరంగా ఉంచి కనీసం గంటపాటు ఆటలాడేలా చూడాలని కోరారు. అనంతరం గురువులకు రాంకిషన్, షరీఫ్, పీడీ శ్రీధర్ బహుమతులు అందజేశారు.

తేమశాతం తక్కువ ఉంటేనే కొనుగోళ్లు



తేమశాతం పరిశీలిస్తున్న ఏపీఎం ప్రేమలత

చిలప్‌చెడ్(నర్సాపూర్): ధాన్యంలో తక్కువ తేమ శాతం ఉంటేనే కొనుగోలు చేస్తామని ఏపీఎం ప్రేమలత స్పష్టం చేశారు. సోమవారం మండల పరిధి చండూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఓ వైపు కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసిపోవడం, తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించకపోవడం ఎంతవరకు సమంజసమని రైతులు ఏపీఎం ప్రేమలతను ప్రశ్నించారు. పైగా తడసిన ధాన్యం బస్తాలు మొలకెత్తితే పట్టించుకోకుండా, తేమశాతం తక్కువగా ఉండేలా చూసుకోమనడం సరికాదన్నారు. రైతులు అన్ని విధాల కేంద్రం నిర్వాహకులకు సహకరిస్తున్న , అధికారులు మాత్రం రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఈ విషయమై ప్రేమలత మాట్లాడుతూ.. రైస్‌మిల్లుల యాజమాన్యం ధాన్యం బస్తాలను త్వరగా ఖాళీ చేయకపోవడంతో లారీల కొరత ఏర్పడుతుందన్నారు. తేమశాతం తక్కువ ఉంటేనే ధాన్యం కొనుగోలు చేయాలని పైఅధికారులు సూచించారని చెప్పారు.

రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి

ఏడీఏ రాం ప్రసాద్

టేక్మాల్(మెదక్): విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే ప్రతిరైతు రసీదు తీసుకోవాలని పెద్దశంకరంపేట ఏడీఏ రాంప్రసాద్ తెలిపారు. సోమవారం టేక్మాల్ రైతు వేదికలో అల్లాదుర్గ్, రేగోడ్, టేక్మాల్, శంకరంపేట–ఏ మండలాలకు సంబంధించిన విత్తన డీలర్లకు షాపుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానాకాలం సీజన్‌లో కల్తీ విత్తనాలు అమ్మితే సంబంధిత దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ విత్తన ప్యాకెట్‌పైన నీలం, ఆకుపచ్చ రంగుల్లో ఉంటే ప్రభుత్వ ధ్రువీకరణ ట్యాగ్‌ని సరిచూసుకోవాలని సూచించారు. ప్రతీ ప్యాకెట్‌పైన విత్తన రకం, లాట్ నంబర్ ఉంటుందని, విత్తనాల గడువు తేదీ కూడా నిర్ధారించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ రాంప్రసాద్

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు విత్తనాలు కొనుగోలు చేయగానే తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని ఏఓ స్వప్న తెలిపారు. సోమవారం మండలంలోని నాగ్సాన్‌పల్లిలో విత్తనాల కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. రశీదు తప్పనిసరిగా తీసుకుని పంటకాలం పూర్తి అయ్యే వరకు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. ఏఈఓ సౌజన్య రైతులు పాల్గొన్నారు.

రేగోడ్ అధ్యక్ష పదవికి పోటా పోటీ

కాంగ్రెస్‌లో సంస్థాగత సందడి

రేగోడ్(మెదక్): మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవిని ఎలాగైన దక్కించుకోవాలని ఆశావహులు పోటీ పడుతున్నారు. ఎన్నడూ లేని విధంగా మండల అధ్యక్ష పదవికి 13 మంది దరఖాస్తు చేసినట్లు సమాచారం. కాంగ్రెస్‌లో క్రమ శిక్షణతో పాటు పార్టీ విధేయులకే పదవులు కట్టబెట్టనున్నట్లు తెలుస్తోంది. రేగోడ్ మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో పదేళ్ల క్రితం వేసిన గ్రామ కమిటీలు కొనసాగుతున్నాయి. పార్టీ బలోపేతం కోసం పని చేసిన వారికి పదవులు ఇవ్వాలని అధిష్టానం చెప్పడంతో నేతల్లో ఆశలు చిగురించాయి. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుచుకునేలా పదవులను భర్తీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో 2017 లోపు కాంగ్రెస్‌లో చేరిన వారికి మండల అధ్యక్ష పదవి ఇవ్వాలని నిర్ణయించింది. మండల అధ్యక్ష పదవికి రేగోడ్ నుంచి 8, మర్పల్లి నుంచి 3, కొత్వాన్‌పల్లి నుంచి 1, ఆర్.ఇటిక్యాల నుంచి 1, బ్లాక్ కాంగ్రెస్ పదవికి 2 దరఖాస్తులను ఆశావహులు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జిలు మెట్టు సాయి కుమార్, వరప్రసాద్, జిల్లా అధ్యక్షుడు అంజనేయులుగౌడ్‌కు అందజేశారు.

గోవుల రవాణాను అడ్డుకోవాలి

టేక్మాల్(మెదక్): గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని బీజేవైఎం జిల్లా కార్యదర్శి మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో టేక్మాల్ మండల తహసీల్దార్ తులసీరామ్, ఏఎస్‌ఐ కృష్ణకు వేర్వేరుగా వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మదన్‌రెడ్డి మాట్లాడుతూ.. కొందరు అక్రమార్కులు పక్క రాష్ట్రాలకు గోవులను అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో గోవుల అభివృద్ధి శాతం తగ్గుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు మోహన్, శ్రీనివాస్, సుధాకర్, కుమార్, దుర్గేష్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న చైర్మన్, ట్రస్ట్ సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి గూడూర్‌లో నిర్మించిన శ్రీ గురుపీఠంలో ప్రతిష్ఠంచనున్న దత్తాత్రేయ, సాయిబాబా విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం రావాల్సిందిగా సోమవారం పలువురికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. శ్రీ గురుపీఠం చైర్మన్ శివకుమార్‌గౌడ్, వేద పండితుడు వామనశర్మ, ట్రస్టు సభ్యులు రమణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, భిక్షపతియాదవ్ ఆధ్వర్యంలో దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, డీఈఓ రాధాకిషన్, మాజీ జెడ్పీ చైర్మన్ హేమలత, డీఎస్పీ రామారావుతోపాటు పలువురు ప్రముఖులకు ఆహ్వానపత్రిక అందజేశారు.

ఆలయంలో చోరీ

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్‌లో దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి దుండగుడు చోరీకి పాల్పడ్డాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు అదే గ్రామానికి చెందిన మహమ్మద్ జహంగీర్‌గా పోలీసులు గుర్తించారు. గతంలో దుర్గమ్మ ఆలయ హుండీని సైతం పగులగొట్టి నగదును దోచుకెళ్లాడని, పలు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరారు. కాగ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ శివానందం తెలిపారు.

ట్రాక్టర్ నుంచి డీజిల్, బ్యాటరీ

కొల్చారం(నర్సాపూర్): ఇంటి ఎదుట నిలిపిన ట్రాక్టర్ నుంచి అర్ధరాత్రి దొంగలు 30 లీటర్ల డీజిల్, ట్రాక్టర్ బ్యాటరీని ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మండలంలోని వెంకటాపూర గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన పెద్దోళ్ల మల్లేశం ఆదివారం వ్యవసాయం పని ముగించుకొని ట్రాక్టర్‌ను తీసుకొచ్చి ఇంటి ఎదుట నిలిపాడు. ఉదయం చూసేసరికి బ్యాటరీతోపాటు ట్రాక్టర్‌లో ఉన్న డీజిల్ ట్యాంక్ ఖాళీ అయి కనిపించింది. దాదాపు రూ.10 వేల వరకు నష్టపోవాల్సి వచ్చిందని బాధితుడు వాపోయాడు. దుండగులను పట్టుకొని శిక్షించాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తెగిపడిన విద్యుత్ తీగలు

పొంచి ఉన్న ప్రమాదం



రుస్తుంపేటలో తెగిపడిన విద్యుత్ తీగలు

నర్సాపూర్ రూరల్: ఈదురు గాలులకు తెగిపడిన విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉందని రుస్తుంపేట గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇరవై రోజుల క్రితం ఈదురు గాలులతో కూడిన వర్షానికి నక్కలకుంట సమీపంలోని వ్యవసాయ బోరు మోటార్లకు సంబంధించిన విద్యుత్ తీగలు తెగిపడడంతో పాటు స్తంభాలు నేలకొరిగాయి. అప్పటి నుంచి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఎవరైనా ఆన్ చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. స్తంభాలను సరిచేయాలని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఈ విషయమై విద్యుత్ శాఖ లైన్ మెన్ వేణుగోపాల్‌ను వివరణ కోరగా తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయం ఏఈ, ఏడీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వాతావరణం సహకరించకపోవడంతో మరమ్మతులలో జాప్యం జరుగుతోందన్నారు.

అధికారులకు కులం పేరుతో దూషణ

ఇద్దరిపై కేసు నమోదు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రజావాణి దరఖాస్తు విచారణకు వెళ్లిన గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓను కులం పేరుతో దూషించిన ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సోమవారం ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. అధికారుల కథనం మేరకు.. ప్రజావాణిలో వచ్చిన ఓ ఫిర్యాదు మేరకు దేవులపల్లి గ్రామానికి పంచాయతీ కార్యదర్శి బొమ్మర్తి జ్యోతి, ఎంపీఓ కలీముల్లా వెళ్లి విచారణ చేస్తున్నారు. కాగా గతేడాది గ్రామంలో డెంగీ ప్రబలడంతో గ్రామానికి చెందిన జింక వెంకటేశం గ్రామ సమీపంలో తీసిన చేపల గుంత కారణంగా దోమలు పెరిగి డెంగీ వ్యాధికి కారణమైందని పూడ్చివేయాలని జిల్లా అధికారులు ఆదేశించడంతో అప్పట్లో నోటీసులు ఇచ్చారు. అయినా ఇంత వరకు పూడ్చలేదు. దీంతో ఇంటికి నోటీసులు అతికించేందుకు వెళ్లగా జింక వెంకటేశం, అతడి అక్క కంసమ్మ ఇద్దరూ పంచాయతీ కార్యర్శితోపాటు ఎంపీఓను బూతులు తిడుతూ విధులకు ఆటంకం కలిగించడంతోపాటు కులంపేరుతో దూషించారు. పంచాయతీ కార్యదర్శి జ్యోతి ఫిర్యాదు మేరకు ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించడం, బూతులు తిట్టడం, కులంపేరుతో దూషించడం కింద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. జింక వెంకటేశంపై గతంలోనే రౌడీషీటర్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



శివ్వంపేట: బడిబాటలో ఉపాధ్యాయులు



కౌడిపల్లి పాఠశాలలో బడిబాటపై సమావేశం

శివ్వంపేట(నర్సాపూర్): తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని శివ్వంపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలచంద్రం అన్నారు. సోమవారం శివ్వంపేటలో విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతోపాటు, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్, పుస్తకాలు ఉచితంగా ఇవ్వడంతోపాటు ఉత్తమ బోధన అందివ్వడం జరుగుతుందని తెలిపారు.

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని ఎంఈఓ వెంకటేశం అన్నారు. పెద్దశంకరంపేటలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సదుపాయాలపై తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు విఠల్, సత్యకుమార్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, సిద్ధిరాములు, రాములు, గోపి, రామకృష్ణాగౌడ్, సాయాగౌడ్, అంగన్‌వాడీ టీచర్లు సరళ, స్వరూప పాల్గొన్నారు.

తూప్రాన్: ప్రభుత్వం బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పట్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వినూత్నంగా ఇంటింటా విద్యార్థులను చేర్చుకునేందుకు ప్రచారం చేపట్టారు. ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు, విద్యార్థులకు ప్రభుత్వ పరంగా అందిస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పట్లూరి లక్ష్మణ్ ఉపాధ్యాయులు నరేష్ రెడ్డి, అనిత, పద్మ, శ్రీవాణి, తిరుమల, నుస్రత్ పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు సహకరించాలని కౌడిపల్లి ఎల్‌ఎఫ్‌ఎల్ (లో ఫిమేల్ లిట్రసీ) హెచ్‌ఎం ఓంప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులతో బడిబాట కార్యక్రమంలో భాగంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5 నుంచి 6ఏళ్లలోపు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్యబోధన, పౌష్టికాహారం, పుస్తకాలు, నోట్‌బుక్కులు ఇస్తున్నామని తెలిపారు. పదవ తరగతి చదవకుండా మధ్యలో చదువు మానేసినవారిని ఓపెన్ టెన్త్‌లో అడ్మిషన్ చేయాలని సూచించారు.

తాగునీటికి తండావాసుల ఇక్కట్లు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని మాసాయిపేట, రామంతాపూర్, రామంతాపూర్ తండాలకు నెల రోజుల నుంచి మిషన్ భగీరథ మంచినీటి సరఫరా నిలిచిపోయింది. మాసాయిపేటలోని సంపు వద్ద బోరు మోటార్‌కు ఉన్న విద్యుత్ తీగలు గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లడంతో ఆయా గ్రామాలకు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. స్థానికంగా ఉండే బోర్‌మోటార్ల ద్వారా మంచినీటిని ట్యాంకులకు సరఫరా చేసి పంపిణీ చేస్తున్నా రామంతాపూర్‌తండాలో మాత్రం సమస్య తీవ్రంగా ఉంది. దీంతో తండామహిళలు, చిన్నారులు గ్రామ శివారులోని పంటపొలాల నుంచి మంచినీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. సమస్యపై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని తండావాసులు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



పొలాల నుంచి నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు

పచ్చిరొట్టతో భూసార పరిరక్షణ

వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్‌నారాయణ

రామాయంపేట(మెదక్): భూ సారాన్ని కాపాడటంతోపాటు గాలిలోని నత్రజనిని నేలలో స్థిరీకరింపజేయడానికి జనుము, జీలుగ లాంటి పచ్చి రొట్టు విత్తనాలు దోహదపడుతాయని స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్‌నారాయణ అన్నారు. వ్యవసాయ కార్యాలయం వద్ద సోమవారం జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

సద్వినియోగం చేసుకోవాలి

పాపన్నపేట(మెదక్): సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తున్న జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేశ్ సూచించారు. కార్యక్రమంలో ఏఓ నాగమాధురి, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): రైతులు తమ పంటపొలాలో భూసారం పెరిగేందుకు అవసరమైన పచ్చిరొట్ట వాడాలని సత్నాయపల్లి వ్యవసాయ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శోభారాణి సూచించారు. సోమవారం చిన్నశంకరంపేట మండలంలోని చెన్నాయిపల్లి గ్రామంలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ ప్రవీణ్ కుమార్, ఏఈఓ శ్రీధర్ పాల్గొన్నారు.



రామాయంపేటలో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న రాజ్‌నారాయణ తదితరులు

నిజాంపేట(మెదక్): నిజాంపేటలో సోమవారం మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి రైతులకు జీలుగు విత్తనాలు సరఫరా చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని రైతులు సద్వినియోగపర్చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ,రైతులు పాల్గొన్నారు.



బోనాలతో మహిళలు

గంగమ్మకు బోనాలు

పెద్దశంకరంపేట(మెదక్): తిరుమలాపూర్ చెరువు కట్ట వద్ద ఉన్న గంగమ్మకు మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం బోనాలు సమర్పించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో భాజాభజంత్రీలు, శివసత్తుల నృత్యాల మధ్య ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.